సాక్షి తిరుపతి

శుక్రవారం ı 20 ı జనవరి ı 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,460
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,222
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,500
రిటైల్ వెండి గ్రాము	రూ.71.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	19
చిత్తూరు	30	18
తిరుమల	26	14
గూడూరు	31	20
నగరి	31	19



శాస్త్రోక్తంగా దక్షిణామూర్తి హోమం

తిరుపతి కల్చరల్: టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీదక్షిణామూర్తి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గడపగడపకు అర్జీల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు దృష్టి పెట్టాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మరోవైపు భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఇచ్చిన గడువులోపు పూర్తి చేయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలియజేశారు. సర్వే లక్ష్యం ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, సర్వే ఏడీ జయరాజ్, డీఎల్‌డీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో



తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

వెంకటగిరిరూరల్: ఆధార్ సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శి ఫణేంద్రకు మెమో జారీ చేవారు. మండలంలోని పెట్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ సవరణ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీఓ కోటేశ్వరరావు తనిఖీ చేశారు. అందులో ఫణేంద్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మెమో జారీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆధార్ సవరణలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. మండలంలో ఈనెల 24వ తేదీ వరకు ఆధార్ సవరణలు ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

చుట్టూ నీరు.. మధ్యలో ఊరు



ఇరకం దీవి

చిత్తూరు నుంచి తిరుపతి ప్రత్యేక జిల్లాగా వేరుపడ్డాక ఈ ప్రాంతానికి సముద్రంతో పాటూ ఒక దీవి వచ్చి చేరింది. ఆ దీవి పేరు ఇరకం. ఇది తడ మండలంలోని పులికాట్ సరస్సు మధ్యలో ఉంది. చుట్టూ నీరు.. మధ్యలో ఊరు. ఈ దీవిలో పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రత్యేకతలున్నాయి. అక్కడి ప్రయాణం ఓ మధురానుభూతిని మిగుల్చుతుంది. చల్లటి గాలులు.. తెలికపాటి అలల మధ్య సాగే పడవ ప్రయాణం.. గాలివాటున దూసుకెళ్లే తెరచాప పడవలు.. ఓవైపు ఎగురుతూ కనిపించే విదేశీ పక్షులు.. ఈ దృశ్యాలు ఎంతో ఆహ్లాదంగా.. అద్భుతంగా కనిపిస్తాయి. మరో విశేషమేమంటే.. రెండు గ్రామాలున్న ఈ దీవిలో చుట్టూ ఉప్పునీరున్నా.. తాగేందుకు మంచినీరు పుష్కలంగా లభించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ప్రాంతానికి పర్యాటక శోభ తేవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

- ఇరకం దీవి ప్రత్యేకం
- ప్రకృతి ప్రియులకు స్వర్గధామం
- పడవ ప్రయాణమే ఏకైక మార్గం
- పర్యాటకంతోనే ఉపాధి


తడ: కొత్తగా ఏర్పాటైన తిరుపతి జిల్లాకి నెల్లూరు జిలాల్లోని సముద్రం (బంగాళాఖాతం) తడ మండలం పరిధిలోని పులికాట్ సరస్సు, సరస్సు నడుమ ఉన్న అందాల ఇరకం దీవి సొంతమయింది. 4,486 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ దీవిలోని ఇరకం గ్రామంలో మొదలియార్‌లు, హరిజనులు, గిరిజనులతోపాటు తిరువెంకటానగర్ కుప్పంలో సుమారు రెండు వేల మంది కలిగిన మత్స్యకారులు 580 ఇళ్లల్లో జీవిస్తూ ఉన్నారు. ఈ దీవిలో 2200 ఎకరాల వ్యవసాయభూమి ఉండగా ఇందులో వరి సాగు చేస్తారు. దీవిలో నుంచి 200 మంది విద్యార్థులు ఆరంబాకం, సున్నపుగుంట గ్రామాలకు చదువు కోసం పడవల్లో పులికాట్ సరస్సు మీదుగా రాకపోకలు సాగిస్తూ ఉంటారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు

ఇరకం దీవిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. సీఎం ఆదేశాల మేరకు సూళ్లూరుపేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య ఇరకం దీవితోపాటు బీవీపాళెం, వేనాడు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రా, తమిళనాడు పర్యాటకులు సేద తీరేందుకు బీవీపాళెంలో నిర్మించిన రిసార్టులను టెండర్ల ద్వారా సమర్థులైన వారికి అప్పగించడంతోపాటు ఇరకం దీవిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి పర్యాటకులకు వసతులు కల్పిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఇరకం దీవిలోని ప్రజలకు స్థానికంగానే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించడంతోపాటు వారికి సంబంధించిన భూములకు మంచి గిరాకీ లభించనుంది.

వేట కష్టతరం

దశాబ్దాలుగా బంగాళాఖాతం నుంచి పులికాట్ సరస్సుకి నీటిని అందించే ముఖద్వారాలు పూడిపోతూ రావడం, సరస్సుకి సముద్రంద్వారా వచ్చే నీటికి అడ్డుకట్ట పడడంతో సముద్రం, సరస్సు మధ్య నీటితోపాటు రాకపోకలు సాగించే చేపలు, రొయ్యల కదలికలు తగ్గి పోయాయి. దీంతో మత్స్యకారులకు వేట కష్టతరమైంది. కొందరు అత్యాశ పరులు తమ స్వార్థం కోసం సరస్సు చుట్టూ ఉన్న పొర్లుకట్టను ధ్వంసం చేయడంతో ఉప్పునీళ్లు పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతిన్నాయి. ఇక్కడ చదువుకైనా, కాన్పుకైనా, పాముకరిచినా, అత్యవసర పరిస్థితిలో అయినా పడవ ప్రయాణం తప్ప మరో దారిలేదు.



సరస్సు మధ్యలో వేటాడుతున్న విహంగాలు



వల నుంచి చేపలను తీస్తున్న జాలర్లు



ఇరకం పంచాయతీలోని మత్స్యకారులు నివశించే వడకోడి కుప్పం (తిరువెంకటానగర్)

పడవలో షికారు

మరో వైపు ఈ దీవి వైపు పర్యాటకుల చూపు పడింది. ఆహ్లాదంగా కనిపించే సరస్సుపై పడవలో షికారు తిరగాలంటే మక్కువ చూపుతున్నారు. పండగలు, సెలవు దినాల్లో ప్రకృతి ప్రియులు బీవీపాళెం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి పడవల ద్వారా ఇరకం వెళతారు. అక్కడ సాయంత్రం వరకు సేదతీరి ప్రకృతి అందాలను ఆస్వాదించి తిరిగి వస్తున్నారు. బీవీపాళెం నుంచి పడవ ద్వారా 11 కిలో మీటర్ల దూరం ఉన్న ఇరకం దీవికి వెళ్లాలంటే పట్టే 40-45 నిమిషాల ప్రయాణం మంచి అనుభూతిని ఇస్తుంది. సరస్సులో చేపల వేట సాగించే తెరచాప పడవలు, అక్కడక్కడ చేపల కోసం కాచుకు కూర్చున్న విహంగాలు, పడవల పక్కనే ఎగిరెగిరి పడుతూ చేపలు చేసే విన్యాసాలు పర్యాటకులకు మంచి ఆహ్లాదాన్ని అందిస్తాయి. ఇరకం తెల్లటి ఇసుకతో నిండిన గ్రామం. నీటి కోసం అక్కడక్కడ తవ్విన దొరువులు, దొరువుల చుట్టూ మొలిచిన మొగలి పొదలు, వెదురు చెట్లు సరికొత్త అనుభవాన్ని అందిస్తాయి.



పడవలో ప్రయాణిస్తున్న పర్యాటకులు

పెట్టుబడులకు పోటీలు



ఇరకం దీవిలో పర్యాటక రంగం అభివృద్ధికి పెట్టుబడి దారులు పోటీ పడుతున్నారు. బయటి ప్రాంతాలకన్నా ఇరకంలో మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇరకం దీవి వేనాడు గ్రామం మధ్య సరస్సులో పడవల రాకపోకలకు వీలుగా 400 మీటర్ల మేర వంతెన దానికి అటు ఇటు మరో 400 మీటర్లు రోడ్డు వసతి ఉండేలా మొత్తం 800 మీటర్ల పొడవున 70 కోట్ల వ్యయంతో వంతెన నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. పర్యావరణ, వన్య ప్రాణి విభాగాల వారి అనుమతులు వస్తే పనులు మొదలవుతాయి. బీవీపాళెం రిసార్టులు, ఇరకం దీవిలో త్వరలోనే పనులు మొదలు కానున్నాయి.

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

ఇరకంలో మంచి వనరులు



చెన్నై, తిరుపతి, నెల్లూరు నగరాలకు సమాన దూరంలో ఉన్న ఇరకం దీవిలో పర్యాటక పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో అధికారులు, పెట్టుబడిదారులు ఇరకంలో తరచూ పర్యటనలు చేస్తున్నారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తోంది. ఇది పూర్తి అయితే ఇక్కడి యువతకు ఉపాధి లభించనుంది.

– గుణశేఖర్, ఇరకం

సంక్షేమమే విజయ సారథి

'' ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ విజయానికి సారథులుగా నిలుస్తాయి. ఈ పథకాలు సక్రమంగా ప్రజల ముంగిట్లోకి చేరాలంటే సచివాలయ వ్యవస్థ బలోపేతం కావాల్సి ఉంది. ఈ పథకాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుని పార్టీ శ్రేణులు సైనికుల్లా పోరాడాలి. అన్ని స్థాయిల్లోని పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి సంక్షేమ ప్రదాత జగనన్నకు అధికార పీఠాన్ని మరోసారి కానుకగా ఇవ్వడమే మన లక్ష్యం, కర్తవ్యం.'' ఇదే తిరుపతిలో గురువారం నిర్వహించిన జిల్లా జేసీఎస్ సదస్సులో ప్రతిధ్వనించిన సందేశం.

- పార్టీని మరింత బలోపేతం చేద్దాం : మాజీ మంత్రి బాలినేని
- జగనన్నను మరోసారి సీఎం చేద్దాం : నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి
- కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యం : భూమన కరుణాకరరెడ్డి
- సచివాలయ వ్యవస్థ బలోపేతం: జేసీఎస్ స్టేట్ కో-ఆర్డినేటర్ శివశంకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ కో-ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులురెడ్డి



జేసీఎస్ స్టేట్ కో-ఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న కన్వీనర్లు

తిరుపతి అర్బన్: మారుమూల గ్రామాల్లోనూ వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దామంటూ వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి నగరంలోని ప్రైవేటు హోటల్లో గురువారం వైఎస్సార్‌సీపీ జేసీఎస్ (జగనన్న సచివాలయ కన్వీనర్స్ అండ్ గృహ సారథి)ల అవగాహన సదస్సును ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన బాలినేని శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రతి ఇంటికీ చేసిన మంచిని వివరించడానికి చక్కటి వేదిక అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు, అభిమానులదేనని పేర్కొన్నారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతి పక్షాల కుట్రలను తిప్పికొట్టి, జగనన్నను మరోసారి సీఎం చేయాలని పిలుపునిచ్చారు.

- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం పథకాలను అందిస్తోందన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అర్హతనే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తోందని గుర్తుచేశారు. తిరుపతితోపాటు జిల్లా అభివృద్ధిని వివరించారు. ప్రతి కుటుంబానికీ మంచి చేయాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అదేబాటలో శాసనసభ్యులు నడుస్తున్నారని స్పష్టం చేశారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాలతోపాటు ప్రతి పేద కుటుంబానికి సాయం చేస్తున్న జగనన్నను మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి అంతా కృషి చేయాలని చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాలు, ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైపు చూస్తున్నారని చెప్పారు.
- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ గడపగడపకూ ఎంతో ధైర్యంగా వెళ్లడానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే కారణమని పేర్కొన్నారు. ఏ కుటుంబానికి లబ్ధి చేకూరలేదో చెప్పాలంటూ మేము అడుగుతుంటే, ప్రతి కుటుంబం వారు తామకు వచ్చిన పథకాలను వివరిస్తున్నారని చెప్పారు.దే శంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని చెప్పారు.
- జేసీఎస్ స్టేట్ కో ఆర్డినేటర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం తీసుకురావడంతో గ్రామ, వార్డు ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. జేసీఎస్ తొలి సమావేశాన్ని తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జేసీఎస్‌ను ఐదు జోన్‌లుగా విభజించారని తెలిపారు. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు జిల్లాలు జోన్ 4లో ఉన్నాయని వివరించారు. సచివాలయాలు మరిన్ని సేవలు అందించడానికి జేసీఎస్ ప్రతినిధులు కృషి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ప్రతినిధులు తిరకాల మల్లికార్జున్‌గౌడ్, గంగారి రమేష్, భక్తవత్సలం తదితరులు కలిసి రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేలను, పార్టీ అధ్యక్షుడిని సత్కరించారు.
- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న విషయాన్ని గడపగడపకు తెలియజేస్తున్నామని చెప్పారు. పథకాల లబ్ధి పొందిన వారందరూ గడపగడపలో అపూర్వ స్వాగతం పలుకుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

వేడుకగా త్రయోదశి



నందీశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో త్రయోదశి పూజలు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పక్షం రోజులకోసారి వచ్చే త్రయోదశి నాడు ఈ ఆలయంలో నందీశ్వరునికి ప్రదోష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం ఆలయంలోని స్వయంభూ శ్రీ వాల్మీకేశ్వర స్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో నందీశ్వరుని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అంతకు ముందు ఆలయంలో కొలువుదీరిన శ్రీ మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి అలంకరించారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ప్రదోష పూజలకు భక్తులు పోటెత్తారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

అదనపు బస్సులతో రూ.29లక్షల ఆదాయం

తిరుపతి అర్బన్: సంక్రాంతిని పురస్కరించుకుని ఆర్టీసీ వారు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు 102 అదనపు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ సర్వీసులు 71,053 కిలోమీటర్లు తిరిగాయి. వీటి ద్వారా రూ.29.59లక్షలు అదనపు ఆదాయం ఆర్టీసీకి చేకూరింది. కిలోమీటర్‌కు రూ.41.65 వచ్చిందని, సరాసరిగా ఒక్కో సర్వీస్‌లో 79మంది ప్రయాణించినట్లు డీపీటీవో చెంగల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

4న బీ-ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుచానూరు: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఖాళీగానున్న బి-ఫార్మసీ కోర్సుల్లోని ఖాళీగానున్న సీట్ల భర్తీ కోసం ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఫార్మసీ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన బైపీసీ అభ్యర్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పాస్‌ఫోటోలతో ఉదయం 10 నుంచి 11 గంటల్లోపు హాజరు కావాలని కోరారు. ఎంపికైన విద్యార్థినులు రూ.17,834 ఫీజు అదే రోజు చెల్లించాలని, ఫీజు రీయింబర్స్ మెంట్ వర్తించదని తెలిపారు. వివరాలకు www.spmvv.ac.inను సందర్శించాలని తెలియజేశారు

పోలీస్ పరీక్ష కేంద్రాల పరిశీలన

తిరుపతి క్రైమ్: పోలీస్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు జరగనున్న పరీక్షలకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవాని నగర్ లోని గీతం స్కూల్, యశోద నగర్ లోని లిటిల్ ఏంజెల్ స్కూల్, జీవకోనలోని విశ్వం స్కూళ్లను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలవుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు సురేందర్ రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు పాల్గొన్నారు.

తెలుగు గంగ కాలువ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మహేంద్రప్రతాప్ సింగ్

సత్యవేడు: తెలుగు గంగ కాలువను కృష్ణానది అభివృద్ధి బోర్డు చైర్మన్ మహేంద్ర ప్రతాప్ సింగ్ గురువారం పరిశీలించారు. తెలుగుగంగ జిల్లా ఎస్ఈ రాజరాజేశ్వరి, ఈఈ సుబ్రమణ్యంతో కలిసి కాలువ పరివాహక ప్రాంతాలతో పాటు తొండుగులి జీరో పాయింట్‌ను సందర్శించారు. వీరికి తమిళనాడు ఈఈ తిలకేశ్వరి స్వాగతం పలికారు. కండలేరు, సోమశిల, తమిళనాడు పూండి జలాశయాల్లో నీటి నిల్వ సామర్థ్యాలను, పూండి జలాశయానికి సంబంధించి చిత్రపటం ద్వారా రాజరాజేశ్వరి వివరించారు. పెన్నా పరివాహక జలాశయం నుంచి చెన్నైకి విడుదల చేసే నీటి వివరాలు, కండలేరు జలాశయాల్లో నిల్వపై చర్చించారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 51.88 టీఎంసీలు, సోమశిల జలాశయంలో 71.5 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక తెలుగు గంగ డీఈ ఓబుల్‌దాస్, పలువురు ఏఈలు, తమిళనాడు అధికారులు పాల్గొన్నారు.

21 నుంచి సీఎం కప్ పోటీలకు ఎంపిక

వెంకటగిరి: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడాపోటీలకు సంబంధించి జిల్లా స్థాయి క్రీడాపోటీలు, జట్ల ఎంపిక ఈనెల 21, 24, 25 తేదీల్లో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రీడా ఇన్‌చార్జ్ మణెమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన పురుషులు, మహిళలకు వేర్వేరుగా అథ్లెటిక్స్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న హాకీ, బాల్ బ్యాడ్మింటన్, ఖో-ఖో పోటీలు, 25న ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీలు తీసుకుని నిర్ణయించిన తేదీల్లో ఉదయం 9 గంటల్లోపు ఆ స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

నేడు న్యాయశాఖ పరీక్షలు

- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జడ్జి భీమారావు


అధికారులతో చర్చిస్తున్న జిల్లా జడ్జి భీమారావు, న్యాయమూర్తులు

తిరుపతి లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా న్యాయశాఖలో ఖాళీగా వున్న 600 పోస్టులకు రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో నేడు పరీక్షలు నిర్వహించనున్నారు. తిరుపతి చెర్లోపల్లి జూ పార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వహించే పరీక్ష కేంద్రాన్ని జిల్లా జడ్జి పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. తిరుపతి జిల్లా పరిధిలో సెక్షన్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్, టైపిస్టు, కాపీయిస్టు, ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్ పోస్టుల తోపాటు ఇతర పోస్టులకు 1168 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కంప్యూటర్ అథారిటీ పరీక్షా విధానం మూడు విడతల్లో నిర్వహించనున్నారు. ఈనెల 20వతేదీ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు రెండవ సెషన్, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మూడవ సెషన్ ఉంటుంది. పరీక్షా కేంద్రం వద్ద ఇంటర్నెట్ సేవలు మెరుగ్గా ఉండేలా చూడాలని జిల్లా జడ్జి సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో, వైద్య ఆరోగ్యం, విద్యుత్ అధికారులతో జిల్లా జడ్జి చర్చించారు. పరీక్ష కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంటముందు వచ్చేలా సమాచారం అందించాలని సూచించారు. జిల్లా జడ్జి వెంట ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి శిరీష్, జూనియర్ సివిల్‌జడ్జి కోటేశ్వరరావు, పవన్‌కుమార్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, ఎమ్మార్‌పల్లి ఎస్‌ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సాయుధ దళానికి నైపుణ్య శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: సాయుధ దళానికి నైపుణ్య శిక్షణ ఇచ్చే వార్షిక మొబలైజేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో 300 మంది సిబ్బందితో 15 రోజుల పాటు జరిగే ఏఆర్ మొబలైజేషన్ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు సివిల్ విభాగానికి ఎల్లవేళలా ఏఆర్ విభాగం సహకారం అందిస్తుందన్నారు. సివిల్ విభాగం కంటే కూడా ఎక్కువ విధులను నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు వెన్నెముకలాగా ఉందని ప్రశంసించారు. వీరు నైపుణ్యాలను మెరుగు పరచుకోవడానికి 15రోజుల పాటు ఈ మొబలైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో మాబ్ కంట్రోల్, ఫైరింగ్, డ్రిల్, ప్రముఖుల బందోబస్తు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. మొబలైజేషన్ లో భాగంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు కులశేఖర్, ఏఆర్ లక్ష్మీ నారాయణ రెడ్డి, ఏఆర్ డీఎస్పీలు రాజేంద్ర రెడ్డి, నందకిషోర్, ఆర్ఐ లు చంద్రశేఖర్, రెడ్డెప్ప రెడ్డి, శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

తడ: జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో బీహార్‌కి చెందిన కంటైనర్ డ్రైవర్ మహమ్మద్ ఇంతియాజ్ ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు, కార్ల లోడ్‌తో చెన్నై నుంచి బిహార్‌కి బయలు దేరిన కంటైనర్ కొండూరు వద్ద ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ నడుపుతున్న ఇంతియాజ్ క్యాబిన్‌లో ఇరుక్కు పోయాడు. తీవ్ర గాయాలతో అల్లాడుతున్న ఇంతియాజ్‌ని స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీశారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి చెన్నైకి తరలించారు.


క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ఇంతియాజ్

డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు


డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డి

తిరుచానూరు : తిరుపతికి చెందిన డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అంతర్జాతీయ అడ్వాన్స్‌డ్ మెటీరియల్ అసోసియేషన్ డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డిని ఫెలోగా ప్రకటించి గౌరవించింది. ఆయన గతంలో ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈయన రూపొందించిన 250 పరిశోధనా పత్రాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ అడ్వాన్స్‌డ్ మెటీరియల్ అసోసియేషన్ ఫెలోగా గౌరవాన్ని పొందారు. ఆయన్ను ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు అభినందించారు.

టీటీడీలో విద్యుత్ ఆదాకు పకడ్బందీ చర్యలు

తిరుపతి అలిపిరి: టీటీడీలో విద్యుత్‌ను ఆదా చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల కార్యాలయంలో ఏపీ ఎస్ఈసీఎం(ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్), నెడ్‌క్యాప్(నాన్‌కన్వెన్షనల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ) సంస్థల అధికారులతో గురువారం ఈవో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ విద్యుత్ ఆదా చర్యల్లో భాగంగా అన్ని విభాగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా టీటీడీలోని తాగునీటి పంపింగ్ స్టేషన్లలో 100 పాత పంపు సెట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నెడ్‌క్యాప్ సంస్థ ఆధ్వర్యంలో టీటీడీలో అన్నప్రసాదాల తయారీకి సోలార్ స్టీమ్ కుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా వంటగ్యాస్ ఆదా అవుతుందన్నారు. ఈమేరకు సదరు సంస్థల అధికారులతో టీటీడీ ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఏపీ ఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి, నెడ్‌క్యాప్ జనరల్ మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డి, ఏరియా మేనేజర్ ఆంజినేయులురెడ్డి, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, డీఈ రవిశంకర్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాన్ని చూపుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

మద్యం తాగి వాహనాలు నడపకండి


భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు సేఫ్టీ ప్లకార్డులు చూపుతున్న అధికారులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మద్యం తాగి వాహనాలు నడపకూడదని తిరుపతి జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని సీసీఎన్ ఫంక్షన్ హాల్లో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా దేశంలో 4 లక్షల మంది వరకు ప్రమాదాల పడుతున్నారని అందులో 1.5 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. యువకులు ట్రిబుల్ రైడింగ్ చేయడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కారులో ప్రయాణించేటప్పుడు తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ఈ వారోత్సవాలు ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ విశ్వనాథం, శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్‌నాయుడు, ట్రాఫిక్ సీఐ వెంకటప్ప, సీఐలు విక్రమ్, అజయ్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ విష్ణువర్ధన్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు ధాథోడ్, ఎస్ఐ మహేష్‌తోపాటు వాహనదారులు పాల్గొన్నారు.

ఆలయాలు వారసత్వ సంపద


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్యులు

తిరుపతి అలిపిరి: ఆలయాలు భారత సనాతన సంప్రదాయ వారసత్వ సంపద అని మద్రాసు సంస్కృత కళాశాల ఆచార్యులు అరుణసుందర శివాచార్య తెలిపారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు జరగనున్న జాతీయ ఆగమ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఆగమ విభాగాధ్యక్షులు డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు సదస్సు లక్ష్యాన్ని వివరించారు. అనంతరం అరుణసుందర శివాచార్య మాట్లాడుతూ ప్రముఖ పురాతన ఆలయాలు ఎలా జీర్ణోద్ధారణ చేయాలి? విమాన గోపురం, బింబం దోషాల పరిహారపు చర్యలకు సంబంధించిన వైఖానస, పాంచరాత్ర, శైవాగమాల్లో ఎలా పొందుపరిచారో తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య జీఎస్సార్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఆగమ, శిల్ప, సంగీత, నృత్య, సాహిత్య, జ్యోతిష్య, వాస్తు, యోగ శాస్త్రాల సమాహారమే దేవాలయం అన్నారు. లోకహితం కోసం ఆగమంలో అనేక విషయాలు చెప్పారని, అటువంటి ఆగమశాస్త్రం ఆలయ శిల్పకళా శోభితంగా ప్రాకార సహితంగా నిర్మించాలన్నారు. వేద విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఆగమాల్లో ఆలయ సంబంధ విషయాలన్నీ సమగ్రంగా చెప్పారని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పండితులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఏపీ రాధేశ్యాం, కోఆర్డినేటర్స్ డా.రాజేష్ కుమార్ డా.నీలకంఠం శివాచార్య డా.జి రామకృష్ణ చార్యులు, ఎఫ్ఓ అంజి రెడ్డి పాల్గొన్నారు .

రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుచానూరు: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు రీసెర్చ్ అసిస్టెంట్ పోస్ట్‌కోసం విశ్వవిద్యాలయం అధికారులు దరఖాస్తులు కోరుతున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www.spmvv.ac.in చూడాలని సీఈవో కళారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

విషగుళికలు తిని కోళ్లు మృతి



కేవీబీపురం: పొలంలో ఎలుకలకు పెట్టిన విషపు గుళికలు తిని 30 నాటుకోళ్లు మృత్యువాత పడిన సంఘటన మండలంలో గురువారం ఉదయం వెలుగుచూసింది. మండలంలోని మతం దళితవాడకు చెందిన చలపతి నాటుకోళ్లను పెంచి విక్రయిస్తుంటాడు. ఈ కోళ్లు అదే గ్రామానికి చెందిన గజేంద్ర పొలంలో మేతకు వెళ్లాయి. కొద్ది సేపటికే ఆ కోళ్లన్నీ మృత్యువాత పడ్డాయి. అనుమానం వచ్చి ఆ పొలాల చుట్టూ పరి శీలించగా అక్కడ వడ్లు ఉడకబెట్టి, వాటితోపాటు విషపూరితమైన గుళికలు కలిపి చల్లి ఉండడాన్ని గమనించారు. దీంతో తమ కోళ్లపై విష ప్రయోగం జరిగిందని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. అయితే రైతు మాత్రం ఎలుకల కోసం ఈ ప్రయత్నం చేసినట్లు చెప్పుకొచ్చాడు.